క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



అమరచింత: టీపీసీసీ గీతకార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే శ్రీహరిని గురువారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. వారి వెంట అయ్యుఖాన్, అరుణ్ కుమార్, కేశవ్ పలువురురున్నారు.

గ్యారంటీల తొలి సంతకం చారిత్రాత్మకం



కొత్తకోట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయగానే తొలి సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయనను పలువురు సన్మానించగా, అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల బాబు, మోహన్‌రెడ్డి, గిన్ని శ్రీనివాస్‌రెడ్డి, గంగుబాల్ రెడ్డి, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో పిచ్చిమొక్కలు, కవర్లు, చెత్త తొలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా భావాన్ని, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తకోట బస్టాండ్‌లో మూతపడ్డ క్యాంటీన్



కొత్తకోట రూరల్: నాలుగు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రంగా ఉండి దినదినాభివృద్ధి చెందుతున్న పట్టణంలో బస్టాండ్ సమస్య వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ బస్టాండ్ అడ్డాగా రోజుకు 150 నుంచి 200 బస్సుల రాకపోకలు జరుగుతుంటాయి. ప్రతిరోజు దాదాపు 2వేల మందికి పైగా ప్రయాణికులు తమ ప్రయాణాలు సాగిస్తుంటారు. 45ఏళ్ల క్రితం ప్రారంభించిన బస్టాండ్‌లో నేటికి సరైన సౌకర్యాలు లేవు. బస్టాండులో ప్రధాన సమస్య తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బస్టాండులో క్యాంటీన్ కొన్నేళ్లుగా మూతపడింది. బీ క్లాస్ బస్టాండ్‌గా పేరున్న కొత్తకోట బస్టాండ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సౌకర్యాలు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవతీసుకుని మూతబడిన క్యాంటీన్ తెరిపించి, బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లను అమర్చండి



వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలోని మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని పలు గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. మండల కేంద్రం నుంచి కల్వరాళ్ల, పుల్గర్‌చర్లకు వెళ్లే రోడ్లలో, కల్వరాళ్ల వీపనగండ్ల మధ్య ప్రధాన మలుపు ఉండడం అక్కడ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉండి పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే వల్లభాపురం, బొల్లారం చౌరస్తా నుంచి తూంకుంటకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు ఉండి ఏపుగా కంపచెట్లు మొలవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని రైతు వ్యవసాయ క్షేత్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో కంది పంట సాగు, కందిలో వివిధ అంతర పంటల సాగు వివరాలు, కంది విత్తనాల అమ్మకం పాటించే పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సురేష్‌కుమార్, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు రక్షణ కవచం కరాటే

- ఆత్మస్థైర్యం నింపేందుకు శిక్షణ
- జిల్లాలోని 89 పాఠశాలల్లో మూడు నెలల పాటు..



దుప్పల్లి పాఠశాలలో కరాటే శిక్షణలో బాలికలు

మదనాపురం: మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారయత్నాలు, విద్యార్థులపై వేధింపులు వారి కుటుంబ సభ్యులను ఎంతగానో ఆవేదన గురిచేస్తున్నాయి. ఉదయం ఇంటి నుంచి బడికి వెళ్లిన విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లిన మహిళలు సాయంత్రం ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు నిత్యం నిరీక్షణ గడుపుతున్న ఈ రోజుల్లో ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈ ఏడాది నుంచి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 89 పాఠశాలల్లో మూడు నెల వరకు రాణి ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మ రక్షప్రశిక్షక్ పేరుతో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలోని 89 పాఠశాలల్లో శిక్షణ

ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో కస్తూర్బా బాలికల విద్యార్థుల విద్యాలయ సంబంధించి ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే బాలికల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కస్తూర్బా బాలికల పాఠశాలల్లో ఇంటర్ వరకు శిక్షణ నిర్వహిస్తున్నారు. మూడు నెలపాటు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో శిక్షణ కొనసాగుతుంది. 36 శిక్షణ తరగతుల చొప్పున జనవరి చివరి వరకు నిర్వహించేలా సిద్ధం చేశారు. వారంలో మూడు రోజుల పాటు నెలకు 12 తరగతిలో చొప్పున విద్యాలయాల్లో వివిధ అకాడమీలకు చెందిన 60 మంది శిక్షకులు తర్ఫీదు ఇస్తున్నారని మాస్టర్ శివయాదవ్ తెలిపారు.

భరోసా ఇస్తుంది

కరాటే శిక్షణ మాలో ఆత్మస్థైర్యం నింపేందుకు దోహదపడుతుంది. మాస్టర్ శిక్షణతో పాటు స్వీయ రక్షణకు మెళకువలను నేర్పిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నాం. శిక్షణ ద్వారా భయం పోయి మనోధైర్యం పెరుగుతుంది. ఎలాంటి అనుచిత పరిస్థితులు ఎదురైనా ప్రతిఘటించి తమను తాము రక్షించుకునేందుకు శిక్షణ తీసుకుంటున్నాం.

– భవాని, పదో తరగతి

మానసిక దృఢత్వం పెరుగుతుంది..



కరాటే శిక్షణతో బాలికల్లో మానసిక దృఢత్వం పెంపొందుతుంది. జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కోసం మూడు నెలపాటు కరాటే జోడో, కుంగ్‌ఫూ వంటి ఆత్మ రక్షణ విద్యలతో పాటు మెలకువలు గురించి శిక్షణ ఇస్తున్నాం. విద్యా బోధనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమయాన్ని వృథా చేయకుండా బాలికల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

– శివయాదవ్, కరాటే మాస్టర్, కొత్తకోట

ధాన్యం కొనుగోలుకు ఆదేశించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పెబ్బేరు రూరల్: ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించేలా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణరావు అధికారులకు ఆదేశించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. గురువారం వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చారని, కొనుగోలులో జాప్యం అవుతుందన్నారు. లక్ష్యం మేరకు కేంద్రాలను తెరవలేదని, విమర్శించారు. ఉమ్మడి పాలమూరు పరిధి గద్వాల జిల్లాల్లో 74 కేంద్రాలకు 7 కేంద్రాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 230 కేంద్రాలకు 77 మాత్రమే ప్రారంభించినట్లు అధికారులు లెక్కలు ఉన్నాయని పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో పూర్తిస్థాయిలో తెరవలేదని తెలిపారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యానికి తేమశాతం ఎక్కువగా ఉందని తూఫాన్ ముసురులకు, మబ్బులకు ధాన్యం ఆరడం లేదన్నారు. మబ్బులతో వరికోతలకు వీలు కాక రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ధాన్యం కేంద్రాలను పూర్తిస్థాయిలో తెరవడంతో పాటు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా వెంటనే కొనుగోలు చేయడంతో పాటు డబ్బులు చెల్లించేలా మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రకురుమయ్య, భూపాల్ పాల్గొన్నారు.

నత్తనడకన గిడ్డంగి పనులు

అమరచింత: మండలంలోని ధర్మాపురం శివారులో నిర్మిస్తున్న గిడ్డంగి నిర్మాణం నత్తనడకన కొనసాగుతుంది. పనులను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు నాణ్యతలను పరిశీలించేందుకు రావడం లేదు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌గా సాయిచంద్ కొనసాగుతున్నప్పుడు తన సొంత మండలానికి 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండేలా రూ.10కోట్ల నిధులను మంజూరు చేశారు. సాయిచంద్ మరణాంతరం గిడ్డంగి పనులను రజనిసాయిచంద్ చైర్‌పర్సన్‌గా ముందుండి కొనసాగించారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ పనులను చేపట్టలేక పోతున్నాడు. ఇప్పటికైన అధికారులు స్పందించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



ధర్మాపురం శివారులో నిర్మిస్తున్న గిడ్డంగి

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



కొత్తకోట చౌరస్తాలో వాహనాల రద్దీ

- ట్రాఫిక్‌తో జటిలమవుతున్న సమస్య

కొత్తకోట రూరల్: కొత్తకోట–మదనాపురం రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకు రోడ్డుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా రోడ్డు వెడల్పు చేయాలని ప్రజల నుంచి వినతులు వస్తున్న అవి ప్రతిపాదనల వరకే పరిమితమవుతున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతూ వస్తోంది. కొత్తకోట చౌరస్తా నుంచి మదనాపురం వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఆ రోడ్డు వైపు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. ఉదయం స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులను, సాయంత్రం స్కూల్స్ నుంచి ఇంటికి వచ్చే విద్యార్థులను తల్లిదండ్రులు బైక్‌లపై తీసుకెళ్తూ చౌరస్తా దాటాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. అంతే కాకుండా ఒక భారీ వాహనం మదనాపురం వైపు నుంచి వచ్చిన, కొత్తకోట నుంచి మదనాపురం వైపు వెళ్లినా నిమిషాల తరబడి ట్రాఫిక్‌లో వాహనదారులు ఇరుక్కుపోవడం పరిపాటిగా మారింది. అనేక సందర్భాల్లో రోడ్డు వెడల్పు కోసం మున్సిపాలిటీలో తీర్మానం చేసి ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండాపోయిందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఆత్మకూర్, అమరచింత, మక్తల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే చెరుకు ట్రాక్టర్లు, లారీలు సైతం ఈ రహదారి గుండానే వెళ్లాల్సి వస్తుంది. కొత్తకోట బైపాస్ పక్కన వేసిన సర్వీస్ రోడ్డును పునరుద్ధరించి చెరుకు ట్రాక్టర్లను ఆ సర్వీస్ రోడ్డుపై మళ్లిస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు. అంతే కాకుండా మున్సిపాలిటీ పాలకవర్గం కొత్తకోట–మదనాపురం రోడ్డు విస్తరణకు కృషి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆరెకటికల సమస్యలు పరిష్కరించాలి


వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలలో చాలీచాలని జీవితాలతో కాలాన్ని వెల్లదీస్తున్న ఆరెకటిక కులస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆరెకటిక సంఘం మండల అధ్యక్షుడు శివాజీ, శ్రీను, బాలాజీ, శంకర్, వెంకట్రావు కోరారు. గత ప్రభుత్వం ఆరెకటికెల ఫెడరేషన్ ఏర్పాటు చేస్తానని, బీసీ కులవృత్తులకు అందజేస్తామన్న ఆర్థిక సాయంలో ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని అన్నారు. మటన్ మార్కెట్ల ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని, ఆర్థికసాయాన్ని అందజేయాలని వారు కోరారు.

ఆలయాల్లో నాయకుల పూజలు



గోపాలపేట: రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం మండలంలోని మున్ననూరులో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ వాసవిఅమరేందర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్లు యాదవ్, గోవర్ధన్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆంజనేయ స్వామి ఆలయంలో రేవంత్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాటు పరిపాలన కొనసాగించాలని పేదలు, మధ్య తరగతి కుటుంబాల కోసం పనిచేయాలని కోరుకున్నారు.

వలంటీర్లకు వేతనాలు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండగా స్కూల్ కమిటీ, గ్రామస్తులు కలిసి ఇద్దరు వలంటీర్లను నియమించారు. ఇందుకుగాను వారి వేతనాలు చెల్లించేందుకు గ్రామంలోని పలువురు ఆర్థికసాయం అందజేశారు. ఎస్.రాజేందర్‌రెడ్డి రూ.10వేలు, మంద కృష్ణ కుమార్ రూ.10వేలు, గాదం పరమేష్ రూ.10వేలు, వీ.పరశురాం రూ.2వేలు, పలువురు ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్కూల్ కమిటీ అభినందనలు తెలిపారు.

ఎమ్మార్సీకి మరమ్మతు కరవు



మండల ఎమ్మార్సీ భవనం



పైకప్పు పెచ్చులూడి సీకులు తేలిన ఎమ్మార్సీ భవనం

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబు పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. భవనం వెనుక, ముందు భాగంలోని గోడలు పగళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. ఈ భవనాన్ని చూసిన సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. భవనం నిర్మించి 20 ఏళ్లకు పైగా అవుతున్నా సరిగా మరమ్మతు చేయడం లేదు. ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మంజూరు కావడం లేదని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తయ్యేనా?



అప్పరాల–తిపడంపల్లి మధ్య ఆగిపోయిన బ్రిడ్జి పనులు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల, ఆత్మకూర్ మండలంలోని తిప్పడంపల్లి మధ్య వంతెన పనులు పూర్తవడం లేదు. ఇరు గ్రామాల మధ్య ఉన్న ఊకచెట్టువాగు వర్షాకాలం వచ్చిందంటే పొంగిపొర్లుతుంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అంతేకాక వాగు దాటి ఆత్మకూర్ మండల కేంద్రానికి, రైల్వే మార్గం ఉన్న శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇరు గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. 2018 ఆగస్టు 30న రూ.5.20కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లుగా పనులకు నోచుకోలేని బ్రిడ్జి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో ఈ ఏడాది మే నెలలో పనులు ప్రారంభమయ్యాయి. మూడు నెలలుగా పనులు ఆగిపోవడంతో ఈ ఏడాదైనా పనులు పూర్తవుతాయా? లేదా అని ఇరు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

శంకుస్థాపనకే పరిమితం



పర్వతాపురం మట్టి రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

రూ.4.70 కోట్ల నిధులు మంజూరు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం కోసం పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.4.70 కోట్లు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయిన తర్వాత కాంట్రాక్టరు పనులు చేయడం లేదు.

2 గ్రామాలు 4గిరిజన తండాలకు మేలు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండతండా వరకు 7.3 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణంతో పాటుగా మార్గమధ్యలో పర్వతాపురం శివారులో ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, షాపురం ఊరంచుతండా, ఆముదంబండ తండా, కోతులకుంటతండా, కర్నెతండాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు పనులు జరిగేలా చూడాలని గ్రామాలు, తండాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ కబీర్‌దాస్‌ను వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



శిలాఫలకం

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



చిన్నంబావిలో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రాష్ట్రంలో మొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పాటుగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, నాయకులు రమేష్, అజీం, నరేందర్‌గౌడ్, గోవిందు, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఎగరవేశారు.

జూపల్లికి మంత్రి పదవిపై హర్షం..

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి కేటాయించడంపై మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు శివరాములుగుప్తా, వెంకటేష్, రాములు, మహేందర్‌యాదవ్ గురువారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

చిన్నంబావి: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం ఏర్పడిన మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు చోటు కల్పించడంపై మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జూపల్లి యువసేన నాయకులు టపాసులు పేల్చుతూ మిఠాయిలు పంచుకున్నారు.

వీపనగండ్ల: ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మంత్రివర్గంలో తీసుకోవడంతో మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. వెనకబడ్డ కొల్లాపూర్ నియోజకవర్గం జూపల్లికి మంత్రి పదవి రావడంతో ప్రగతిపథంలోకి వస్తుందని నాయకులు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, బాల్‌రెడ్డి, పార్టీ గంగిరెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ వెతలు



గురువారం రాత్రి సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్‌జాం

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డపై నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్‌జాంలో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలు ఎప్పుడు తీరుతాయో.. లేదోనని ఆవేదన చెందుతున్నారు. 167వ నంబరు జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎల్ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల హాస్టల్ వరకు 750మీటర్ల మేర పనులు ఆలస్యంగా ప్రారంభించారు. దీనికితోడు రైల్వేలైన్‌పై బ్రిడ్జ్ ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు విస్తరణ జరగకపోవటంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. గురువారం రాత్రి సైతం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా సాగిస్తుండటంతో తరచూ సమస్య ఏర్పడుతోంది. ఇంతకుముందు బ్రిడ్జ్‌కు రెండు వైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ.. అవి ఏనాడో పాడైపోయాయి. బారికేడ్లు రాత్రిళ్లు కానరాకపోవటంతో వాహనదారులు వాటికి ఢీకొట్టి ప్రమాదాల బారిన పడ్డారు. పోలీసులు ఇప్పటికైనా మరోసారి బారికేడ్లు ఏర్పాటు చేసి అవి స్పష్టంగా కనిపించేలా లైటింగ్‌ఏర్పాటు చేస్తే సమస్య కొంత తీరుతుందని పలువురు కోరుతున్నారు.